"అమెరికా తెలుగుసంఘం- అమృత్‌కిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథలపోటీలో తృతీయ బహుమతి పొందిన కథ"

# జాక్

అర్చనా చౌహాన్

గేటు తీసి ఇంట్లోకి అడుగుపెడ్తోంటే నా మనసులో ఎన్నో భావాలు ... ఎన్నెన్నో సంశయాలు ...

మరెన్నో తీపి గుర్తులూ ,చేదు జ్ఞాపకాలు !

ఇంటి ముందున్న పెద్ద కాంపౌండ్‌లో ఒకప్పుడు అందమైన గార్డెన్ ఉండేది.



ఇప్పుడంతా పిచ్చి పిచ్చి మొక్కలున్నాయి.అందమైన లాన్‌లోని గడ్డి ఎడాపెడా పెరిగి వుంది.

ఆ గడ్డిని తప్పించుకుంటూ వచ్చి తలుపుకు వేలాడ్తున్న తాళం కప్పను తీసాను. ఇల్లంతా అలాగే ఉంది. ఎక్కడ సామానక్కడే దుమ్ము పేరుకుపోయింది. మెల్లిగా ఒక సోఫాపై దుమ్ముని దులిపి బాబును పడుకోబెట్టి ఇంటిని పరకాయించి చూశాను.

ఆ ఇల్లు, ఆ ఇంట్లోని ప్రతి వస్తువూ నాకు ఎంతో ప్రియమైనవి. ఆ ఇంటి అణువణువూ నాకు సుపరిచితం.

ఊహ తెల్సిందగ్గర్నించీ నేనా ఇంటినే చూసాను. అక్కడే పెరిగాను. ఆతోటలోనే ఆడాను. పాడాను.

బాల్యంలోని ఫాంటసీలూ, టీన్స్‌లోని స్వప్నాలూ అన్నీ అదుగో ఆ గదిలోనే చూసాను. నా జీవితంలోని మధురమైన సంవత్సరాలు ఇక్కడే గడిపాను.

ఆ మెట్ల మీంచి పడి నా కాలు బెణికిందని నాన్నగారు ఏకంగా మెట్లే తీసివేద్దామనుకున్నారు.

ఇక్కడే వంటగది గడపలో కూర్చుని అమ్మకి సాయం చేసేదాన్ని. అటు డ్రాయింగ్ రూంలోని ఆ వాలుకుర్చీలో కూర్చుని నాన్నగారు రిలాక్స్ అయ్యేవారు.

ఆరోజులన్నీ నిన్నా, మొన్నా అన్నట్లున్నాయి.

కాలమెందుకిలా మారిపోతుందో ?

ఆరోజులు తిరిగి రావెందుకో ?

నేనా ఇంట్లోని ప్రతి వస్తువునూ నాస్టెల్జిక్‌గా ముట్టుకుని చూస్తోన్నాను.

నాకు తెలీకుండానే వాటిపై పేరుకున్న దుమ్ముని దులుపుతున్నాను.

ఉన్నట్టుండి నా చేతులాగిపోయాయి.

ఈ టేబిల్ మీద ఒక ఫొటో ఉండాలి. ఏదీ ?

గబగబా ఫొటో కోసం వెదికాను. టేబిల్ సొరుగులో దొరికింది.

భద్రంగా బైటికి తీసాను.ఆ ఫొటో ఫ్రేముపై పేరుకున్న దుమ్ముని చాలా ప్రేమగా, జాగ్రత్తగా తుడిచాను.

ఆ ఫొటో నేను ఇంటర్లో ఉన్నప్పుడు తీసింది. సంక్రాంతి పండగరోజు కొత్త పట్టుపావడా కట్టుకుని, తలనిండా పూలు పెట్టుకుని నా మొహం ఆనందంగా వెలిగిపోతోంది.

ఆరు బైట వాకిట్లో కుర్చీలు వేసుకుని నాన్నగారూ, అమ్మా కూర్చుని ఉన్నారు. నేనూ, అన్నయ్యా వాళ్ళవెనకాల నుంచుని ఉన్నాము.

ఫొటోలో మా ఫెస్టివ్ మూడ్ కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. అప్పట్లో పండగలంటే ఎంత హడావిడి ఉండేది ?

అబ్బ ! ఉగాదికి అమ్మ చేసే పూర్ణాల రుచీ, ఉగాది పచ్చడి రుచీ, సంక్రాంతి కి చేసే నువ్వుల లడ్డూలూ అన్నీ ఇప్పటికీ గుర్తు.

సంక్రాంతి రోజు ఉదయాన్నే ముగ్గులు వేయాలని ఎంత ఉబలాటమో?

ఫొటోలో వాకిట్లోని ముగ్గులూ, గొబ్బెమ్మలూ స్పష్టంగా నా ఉబలాటాన్ని తెలియచేస్తోన్నాయి. ఆముగ్గులను చూస్తూ కదిలిన నా చూపులు నాన్నగారి కాళ్ళ వద్ద కూర్చున్న ఆకారాన్ని చూసి ఆగిపోయాయి.

జాకీ !

ఆ మొహంలో ఎంత జీవం ఉట్టి పడ్తోందో!

ఆ కళ్ళలో మెరుపు అలర్ట్‌గా , ఆ చూపు నన్నే సూటిగా చూస్తున్నట్టు ఫీలింగ్.

ఆ జీవం ఇప్పుడేదీ ? ఆ మెరుపు ఎక్కడికిపోయిందీ?

నా మనసును ఎవరో పట్టుకుని పిండి నట్లయింది. జాకీని మరి చూళ్లేక ఫొటోని టేబిల్ పై పెట్టేసి వెనుతిరిగాను.

మెల్లిగా పెరటి తలుపు తీసి పెరట్లోకి వచ్చాను. ఇక్కడా అదే పరిస్థితి.

పిచ్చి మొక్కలూ ,గడ్డీ కలగాపులగంగాపెరిగున్నాయి. గోడమీంచి డాబాపైకి పాకిన సన్నజాజి తీగె పోషణ లేక నిస్సత్తువగా వేలాడుతోంది. గులాబీ చెట్లు పిచ్చిగాపెరిగి పూలకీ, ముళ్లకీ తేడా తెలీకుండా ఉంది. ఆ పూలసుగంధం నలువైపులా పాకుతోంది

అప్రయత్నంగ ఒక పెద్ద గులాబిని తెంపి వాసన చూస్తోంటే కనిపించింది ...ఆ పచ్చని గడ్డి మధ్య తెల్లగా మెరుస్తోన్న రాతి చప్టా!

అది ఏవిటో నాకర్థంఅయీ కానట్లుగా ఉంది. అదుర్తోన్న గుండెల్తో, అన్ స్టడీ కాళ్ళతో ఆ చప్టా వద్దకి వెళ్లాను.

నా అనుమానాన్ని నిజం చేస్తో ఆ చెప్టా పై చెక్కిన అక్షరాలు చదూతోంటే నా మెదడు మొద్దుబారింది.

"ఇన్ మెమరీ ఆఫ్ అవర్ బిలవెడ్ జాకీ !"

నేనా చప్టా పక్కనే మోకరిల్లి చేతిలోని గులాబీపువ్వును దానిపై పెట్టాను.

గ్రేవ్ యార్డ్‌లో అయిన వాళ్ళ సమాధి దగ్గర శ్రద్ధాంజలి ఘటిస్తోన్నంత శ్రద్ధగాకూర్చున్నాను.

అవును. నేను జాకీకి ఒక విధంగా శ్రద్ధాంజలే ఘటిస్తున్నాను. నా వల్ల జరిగిన పొరపాటుకు సంతాపం వ్యక్తంచేస్తున్నాను.

నాకు జాకీని ఇంటికి తీసుకురావడం ఇప్పటికీ బాగా గుర్తు.

నాన్నగారి ఫ్రెండింట్లో కుక్క పిల్లలుపెట్టి చనిపోయింది. అప్పుడే ఆయనకి ట్రాన్స్‌ఫర్ అయింది.

ఆ పిల్లల్ని ఆయన తెలిసిన వాళ్లందరికీ పంచి వెళ్ళారు. అలా మా ఇంటికి వచ్చింది జాకీ!

గోధుమ రంగుపై నల్లటి మచ్చలతోఇంకా కళ్లు కూడా సరిగ్గాతెరవలేని ఆ బుజ్జికుక్కపిల్లను చూసి ఇంట్లో అంతా తెగ ముచ్చటపడ్డాము. నేనయితే మరీనూ!దానికి జాకీ అని నేనే నామకరణం చేసాను.

చిన్నగిన్నెలో పాలు పోసి ముందు పెడ్తే జాకీకి ఆ పాలను తాగడం కూడా రాకపోయేది. అంత చిన్న జాకీ కొద్దికాలంలోనే చాలా ఫెరోషియస్‌గా తయారైంది.

అది పెరిగేకొద్దీ కుక్కలా కాకుండా తోడేలులా అన్పించేది. అది కుక్కకీ, తోడేలుకి క్రాస్‌బ్రీడ్ అని ఊళ్ళో రూమర్ మొదలయింది.

మా ఇంటి వైపేం ఖర్మ ఆ పరిసరాల్లోకే రావడం మానేశారు జనాలు!


జాకీ చూడ్డానికి చీల్చి చెండాడే వేటకుక్కలా ఉన్నా దాని మనసెంత సున్నితమో మాకు తెల్సు.

అది ఎన్నడూ ఎవరికీ హాని తలపెట్టలేదు. ఎంత షార్ప్ అంటే ఏ వస్తువు ఎక్కడ దాచినా క్షణాల్లో కనిపెట్టేది.

చిన్న చిన్న ఆటవస్తువులను కావాలని అటూఇటూ దాచి పెట్టి జాకీని తీసుకురమ్మని చెప్పడం ,అది క్షణాల్లో తీసుకు రావడం మా ఫేవరెట్ గేమ్ అయిపోయింది.

అసలు జాకీ తోటిదే అయిపోయింది నా లోకం.

నా దినచర్య జాకీని మార్నింగ్ వాక్‌కి తీస్కెళ్ళటంతో మొదలయి రాత్రి కావలాకి దాని గొలుసు తీయడంతో అంతమయ్యేది.




శ్రీమతి ఎన్. హరిప్రియ, శ్రీరామారైస్ మిల్,స్టువార్ట్‌పురం, బాపట్ల తాలూకా , గుంటూరు (జిల్లా)- 522317

జాకీతో నా అటాచ్‌మెంట్ ఎంతగా పెరిగిందంటే నాకు మరి ఇతర స్నేహితుల అవసరం తెలీలేదు.

అదీ తేజాతో నా పరిచయం అయిందాకా!

నా జీవితంలోకి సుడిగాలి లా ప్రవేశించాడు తేజ. ఆ తాకిడికి అంతవరకూ సాఫీగా సాగిపోతున్న నా జీవితం ఎండుటాకులా రెపరెపలాడిపోయింది.

ఎస్.ఐ. పోస్టుకి సెలక్టయి, ట్రెనింగ్ పూర్తి చేస్కుని పోస్టింగ్ కోసం ఎదుర్చూస్తున్న నాయుడుగారి అబ్బాయి తేజ.

కనులు మూసిన తెరిచినా అతని రూపమే కనిపించసాగింది నాకు అతను తప్ప ఇంక ఏ విషయమూ ఆలోచించలేనంత మైకంలో పడిపోయాను కాని అతన్ని కలవడం కాస్త కష్టంగా ఉండేది.

జాకీని ఈవెనింగ్ వాక్‌కి తీస్కెళ్లినపుడు కలిసేవాడు తేజ. కాని జాకీకి ఎందుకో తేజాని చూస్తే కోపం వచ్చేది.

తేజాని చూస్తే చాలు ఎడతెరిపి తేకుండా మొరవడం మొదలెట్టేది.

"కుక్కలు దొంగల్ని చూసి మొరుగుతాయి. కాని ఇదేంటి ? మీ కుక్క పోలీసుల్ని చూసి మొరుగుతోంది'' అంటూ తేజ ఇరిటేట్ అయ్యేవాడు.

జాకీ అంతగా ఎందుకు ఎజిటేట్ అయ్యేదో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు.

కాని తేజాను చూడగానే దాని ప్రవర్తన నాకు ఆటంకం కలిగించింది. ఇహ జాకీని తీస్కెళ్ళటటం మానేసి నేను వంటరిగానే ఈవెనింగ్ వాక్‌కి వెళ్ళటం మొదలెట్టాను. రోజురోజుకీ మా మధ్య అనుబంధం బలపడింది. కానీ తేజా విషయం ఇంట్లో చెప్తే ఒప్పుకోరని తెల్సు. ఎందుకంటే మా మేనబావకిచ్చి నా పెళ్ళి చేయాలని ఎప్పుడో అనుకున్నారు.

ఇటు తేజాకి పోస్టింగ్ ఆర్డర్స్ వచ్చేసాయి. వెంటనే జాయినవ్వాలి. బాగా ఆలోచించి ఎవరికీ తెలీకుండా గప్ చిప్‌గా పెళ్ళి చేస్కుందామని నిర్ణయించు కున్నాం.

కానీ అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా నేను ఇంట్లోంచి రావడం కష్టం. ఎందుకంటే జాకీకి తెలీకుండా ఇంట్లోకి రావటం ఎంత కష్టమో , ఇంట్లోంచి బయటకు వెళ్ళటం కూడా అంతే కష్టం.అదే చెప్పాను తేజాతో.

రెండవరోజు తేజా నా చేతిలో ఓ పొట్లాం పెట్టాడు. "తిండిలో కలిపి పెట్టు . హాయిగా నిద్రపోతుంది. నువ్వు వచ్చెయ్యి" అన్నాడు.

అనుకున్నట్టు గానే వెళ్ళి రిజిష్టర్ మ్యారేజి చేస్కున్నాం.

తేజా డ్యూటీలో జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చాక అమ్మా,నాన్నల ఆశీర్వాదం కోసం వారం తర్వాత వచ్చాం.

నాన్నగారికి ఎదురుపడాలంటే మనసు పీచు పీచుమంది. వణుకుతోన్న కాళ్ళతో ఇంట్లోకి అడుగుపెట్టాను.

అలవాటు ప్రకారం నేను గేట్లోకి అడుగుపెట్టగానే ఆప్యాయంగా పరిగెత్తుకొచ్చే జాకీ కోసం చూశాను. జాకీ రాలేదు. నాకు కొంచెం ఆశ్చర్యమేసింది.

ఇంట్లోకి వెళ్తే అక్కడ అమ్మా, నాన్నా, అన్నయ్యా అందరూ ఉన్నారు... మౌనంగా.. నిస్త్రాణంగా !

అదేదో శోకసభలా ఉంది.

నన్ను చూడగానే మండి పడ్తారనుకున్నాను. నన్ను శాపనార్థాలు పెడ్తారనుకున్నాను.

కానీ చిత్రంగా నన్నెవరూ ఏమీ అన్లేదు. సాదరంగా కూర్చోబెట్టారు.

అమ్మ కాఫీ కలుపుతానని వంటగదిలోకి వెళ్ళింది. నేనూ లేస్తోంటే వద్దుకూర్చోమంది. నాన్నగారు ముఖ్యమైన పని అంటూ స్టడీలోకి వెళ్లారు.

అన్నయ్య మౌనంగా దిక్కులుచూస్తూకూర్చున్నాడు. ఈ మౌనం కంటే, ఈ పరాయితనం కంటే వాళ్ళు నన్ను ఛడామడా తిడ్తేనే బావుండునేమో!"జాకీ ఎక్కడ ? " మౌనాన్ని ఛేదిస్తూ అడిగాను.

అన్నయ్య ఉలిక్కిపడి నాకేసి చూశాడు. రెప్ప వేయకుండా చూశాడు.

ఆ చూపు నాకు చాలా వింతగా అన్పించింది. ఎందుకంటే ఆ చూపు అసహ్యంతో నిండి నన్ను ఎందుకో నిలదీస్తున్నట్లుగా ఉంది.

"జాకీ నువ్వెళ్ళిన రాత్రి చచ్చిపోయింది". ఏ భావన లేకుండా చెప్పాడు. నేను స్థాణువైపోయాను. గుడ్లప్పగించి నోట మాట లేకుండా చూస్తుండిపోయాను.

"ఎవరో విషం పెట్టారు'' అన్నయ్య అదే భావరాహిత్యంతో అన్నాడు. అన్నయ్య చూపుకి అర్థం అప్పుడు తెల్సింది నాకు. ఇహ అక్కడ ఉండలేకపోయాను.

ఆ తర్వాత తేజాతో చాలా రోజులవరకూ మామూలుగా మాట్లాడలేకపోయాను. అసలింతటి నీచానికి, ఇంతటి కిరాతకానికి ఆయన మనసెలా ఒప్పిందని నిలదీశాను.

"ఓ కుక్క కోసం ఇంతిదయిపోతావేంటి ? '' అన్నాడు తేలిగ్గా.


నాజీవితంలో జాకీ ప్రాముఖ్యతని వర్ణించలేకపోయాను. జాకీకంటే దాని విశ్వాసాన్ని చంపి వేసాననే అంతర్మథనం! జాకీ ఎంత ఆకలితో ఉన్నా సరే పరాయి వాళ్ళేదన్నా పెడ్తే అసలు ముట్టేది కాదు.

నేను పెట్టానని, నేను తనకి ఏ హానీ చేయననే నమ్మకంతో నేను విషం పెట్టినా తిన్నది. అది తింటూ నాకేసి ఆప్యాయంగా, నమ్మకంగా చూసిన చూపు ఎన్నటికీ మరువలేను.

ఆ తర్వాత నేనెప్పుడూ ఆ ఇంటికి రాలేదు. కాని పది సంవత్సరాల తరువాత అమ్మావాళ్ళు ఇల్లు అమ్మేస్తున్నారని, అన్నయ్య దగ్గరే సెటిల్ అవుతున్నారని తెల్సి చివరిసారిగా చూద్దామని వచ్చానిప్పుడు!

నా వెనుక శబ్దమైంది.

చూశాను. బాబు నిలబడి ఉన్నాడు. నన్ను చూసి చిన్నగా నవ్వాడు. బాబుకిప్పుడు తొమ్మిదేళ్ళు నిండాయి అయినా సరిగ్గా నడవలేడు, మాట్లాడలేడు.చిన్న చిన్న కళ్ళు మాత్రం అలర్ట్‌గా మెరుస్తుంటాయి. పళ్ళు షార్ప్‌గా ఉండీ, కొత్తవారెవరైనా దగ్గరికొస్తే కొరికేస్తాడు. నాలుక కొద్దిగాబైటపెట్టి రొప్పుతున్నట్టుగా ఊపిరి పీలుస్తుంటాడు




బి.సుధీర్, బి-39/15 ,ల్యాబ్ క్వార్టర్స్ , కాంచన్‌బాగ్ , హైదరాబాద్-500 258



భానల్

టీచర్: ఒరేయ్ శ్రీను... ఇంగ్లీష్ చానల్ ఎక్కడుందిరా?

శ్రీను: మా టీ.వీ.లో లేదండి టీచర్!!



చూయింగ్ గమ్

భార్య: రానూ రానూ మీకు రోజు రోజుకూ చెముడు ఎక్కువై పోతుందండీ... అబ్బాయి పది నిమిషాలుగా మీ ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నా... ఒక్క మాటకూ సమాధానం చెప్పరేమిటి?

భర్త: చెముడు నాక్కాదే.. నీకు! వాడు పదినిమిషాల నుండీ చూయింగ్‌గమ్ నములుతున్నాడు.

-ముద్దా రమణమూర్తి, 19/254-ఎ8, రాణీనగర్, అనంతపురం

బాబుకి డౌన్స్ సింద్రోమట. డాక్టర్ల అదేదో ఒక క్రోమోజోమ్ తగ్గినందువల్ల పిల్లలు ఇలా పుడతారని, మానసికంగా ఎదగలేరని ఏదేదో చెప్పారు. ఈ సింద్రోమ్ ఉన్న పిల్లలంతా ఇలాగే ఉంటారట! ఏమో!

బాబు పేరు జానకీరామ్. అంతా రామ్ అని పిలుస్తూంటారు. నేను మాత్రం ముద్దుగా ప్రేమగా...

'జాకీ ! నో...'' చప్టా మీద నేను పెట్టిన పువ్వుని జాకీ అదే జానకీరామ్ తీయబోతుంటే వారించాను.

నా వారింపుతో ఉలిక్కిపడి నాకేసి ప్రశ్నార్థకంగా, ఆశ్చర్యంగా చూస్తోన్న నా జాకీని గుండెలకి హత్తుకున్నాను.

అర్చనా చౌహాన్

కేరాఫ్. డా.కె. పుష్ప

ఇం.నెం. 16-2-145 /ఎ/9

మలకొపేట్, హైదరాబాద్ -36

సిద్ధిపురి కథలు

# ఉపాయం

-ఐతా చంద్రయ్య

భాగ్యనగర్లో పరుగు ప్రారంభించిన మారుతీ కారు భారత్ నగర్లో ప్రవేశించింది. ప్రఖ్యాత నవలా రచయిత భరత్‌కుమార్ ఇంటిముందు ఆగింది ఠీవిగా. కార్లోంచి కాలుబయట పెట్టిన వారితో కరచాలనం చేసి సగౌరవంగా లోపలికి తీసికెళ్ళాడు భరత్‌కుమార్.

భరత్‌కుమార్ రచనలంటే పడిచస్తుంది యువలోకం. పోరంబోకులు పోట్లాడుకుంటారు. అందుకే అతని నవలలు హట్‌కేకుల్లా అమ్ముడౌతాయి. సినిమాలుగా వస్తున్నాయి.

అంతకు ముందే అతనికి హైదరాబాదు నుండి ఫోనొచ్చింది... అమెరికాలో ఆరొందల కోట్ల రూపాయలు అవలీలగా సంపాదించిన ఆంధ్రుడు అమరేశ్వర్‌కు హఠాత్తుగా తెలుగు సినిమా తియ్యాలనే ఆలోచన వచ్చిందనీ, ఆ సినిమాకు అరవై కోట్లు కేటాయించాడనీ, ఇటీవలే మార్కెట్లో కొచ్చిన తన నవలే ఆ సినిమాకు కథనీ, ఆ నవల హక్కులు కొనేందుకు కారులో బయలుదేరాడనీ.

"మీ ఇల్లు బయటి నుండి పూరిల్లులా కన్పించినా లోపల రాజభవనంలాగుంది మిస్టర్ భరత్!"

అమరేశ్వర్ అభినందనలకు భరత్‌కుమార్ ఛాతీ అరంగుళాలు పెరిగింది. ఆనందడోలికలూగాడు.

"బయటినుండి బ్రహ్మాండంగా కనబడితే ఇన్‌కం టాక్సోళ్ళ కన్నుబడ్తుంది గదండీ!" వినయంతో ముడుచుకు పోయాడు.

"వెరీనైస్, మీరసలు అమెరికాలో పుట్టాల్సిన వారు. సరే... ఇంతవరకూ ఎన్ని నవలలు ఏ ఏ పేర్లతో రాశారు? ఎంత సంపాదించారు?"

"నా పేరుతో ఆరు, నా భార్య పేరుతో ఐదు, మా పని మనిషి పేరుతో నాల్గు... ఏ పేరుతో రాసినా నా శైలిలోని వాడి, వేడి పాఠకులకు బాగా తెలుసు. అవి చదవాలని యూనివర్శిటీ విద్యార్థులు ఎగబడుతుంటారండీ."

"ఒక్కో నవల కెంత గిట్టుబాటౌతుందీ?"

"సీరియల్‌గా వేసుకున్న పత్రికవాళ్ళో పాతికవేలు, బుక్‌గా పబ్లిష్ చేసిన పబ్లిషరో యాభైవేలు ఆ తర్వాత సినిమాకు కొనుక్కున్న నిర్మాతో ఆరేడు లక్షలు... పూలల్లో పెట్టిస్తున్నారం' అన్నీ సూపర్‌హిట్లే. కాని అన్ని నవలలూ ఒక ఎత్తూ, ఇప్పుడు మీరు కొనబోయే శతకోటి పాపాయి... అనంతకోటి రూపాయలు, నవల ఒక ఎత్తండీ."

"దాన్ని నేను చదివాను. దాన్లో యువతరాన్ని ఉద్రూతలూగించే సెక్స్ సన్నివేశాలు, కోటీశ్వరులు సైతం కొట్టుకుచచ్చే ఎత్తులూ, పన్నులు ఎగ్గొట్టే ఉపాయాలు... చాలా బాగా చూపించారు. అది మీకే సాధ్యమైంది మిస్టర్ భరత్. అందుకే ఆ నవలా హక్కులు కొనేందుకొచ్చాను. చెప్పండి ఎంతిమ్మంటారు? మొహమాటం వద్దు, బేరం ఉండొద్దు."

"ఒకే మాట. పది లక్షలు సార్!"

"సరే... దాంట్లో వైటెంతా, బ్లాకెంతా?"

"పదివేలు వైటు. మిగిలాది బ్లాకు."

"వెరీగుడ్. ఇంత సంపాదించినా పైసా పన్నుగట్టని మీ ప్రావీణ్యతకు నా జోహార్లు."

"ఏదో... మీలాంటి పెద్దల ఆశీస్సులు. ఇక ముందు కూడా కట్టదల్చుకోలేద్సార్!"

"సరే... కాయితం తయారుచెయ్." తన వెంటొచ్చినా యన్ను ఆదేశించాడు అమరేశ్వర్.

పోర్టబుల్ టైప్ రైటర్ టకటకలాడింది. టైపైన కాయితం భరత్‌కుమార్ ముందుంచారు సంతకానికి. కళ్ళతో చదివి కంగారుగా అరిచాడతడు.

"ఆఁ... నో... మోసం...! యూ...యూ..." ఒళ్ళంతా చెమటలుపట్టేసాయి. కాళ్ళు వణుకుతున్నాయి.

"మీరు చెప్పిందంతా ఆడియో, వీడియో కాసెట్లలో కెక్కింది, చూస్తారా?" అమరేశ్వర్ తన ఐడెంటిటీ కార్డు చూపించాడు.

అమరేశ్వర్ అసలు పేరు అంజనికుమార్, ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంటులో ఉన్నతోద్యోగి.

-ఐతా చంద్రయ్య
ఇ.నెం.4-4-11, శేర్పుర,
సిద్ధిపేట - 502 103.